# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి, సులభతర పరిశోధనలను ప్రోత్సహించడంపై దృష్టి సారించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ దుబాయ్‌లో పర్యటిస్తున్నారు.**

3. **చేనేతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఈరోజు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది.**

5. **జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలు తీరుపై కేంద్ర బృందం రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో పర్యటిస్తోంది.**

==========================

దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థ వృద్ధికి, సులభతర పరిశోధనలను ప్రోత్సహించడంపై దృష్టి సారించామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన "ఎమర్జింగ్ సైన్స్ & టెక్నాలజీ ఇన్నోవేషన్ కాన్ క్లేవ్ 2025లో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. విజ్ఞానం, ఆవిష్కరణలు సాంకేతికత పరివర్తనకు దోహదపడతాయన్నారు. భారత్ ను ఆవిష్కరణలకు కేంద్రంగా మార్చేందుకు, పరిశోధనలను ప్రోత్సహించేలా అనేక సంస్కరణలను చేపట్టామని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ... 28 సెకన్లు

---------------------------

రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ దుబాయ్‌లో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఈ నెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు. దుబాయ్ పర్యటనలో ఈరోజు పలు బహుళ జాతీయ సంస్థలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను మంత్రి వివరించి ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించనున్నారు. అనంతరం దుబాయ్ ఇండియన్ కాన్సులేట్ జెనరల్ సతీష్

శివన్ తో మంత్రి నారాయణ బృందం సమావేశం కానుంది.

---------------------------

చేనేతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం రావిపాడులో తుఫాను ప్రభావిత చేనేత కుటుంబాలకు బియ్యం, నిత్యాసర వస్తువులను ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్ 34 సెకన్లు

---------------------------

యునైటెడ్ కింగ్డమ్‌లో రేపటి నుంచి ఈనెల 6వ తేదీ వరకు జరుగనున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ – డబ్ల్యుటిఎమ్ 2025 కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు గత సాయంత్రం ఆయన లండన్ కు చేరుకున్నారు. అనంతరం వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ప్రదర్శన –2025 కు సంబంధించిన కార్యక్రమ వివరాలను టూరిజం కన్సల్టెంట్లు మంత్రికి వివరించారు. అలాగే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ప్రదర్శన–2025 వేదికను, అక్కడ ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ స్టాల్ ను మంత్రి దుర్గేష్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

---------------------------

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈరోజు నుంచి ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. 2025-26 ఖరీఫ్ పంటలో 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల 13 రైతు సేవా కేంద్రాలు, 2 వేల 61 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి “7337359375” వాట్సాప్ నంబర్‌కు “హాయ్” అనే సంక్షిప్త సందేశం పంపి నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

---------------------------

జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విజయ్ రామరాజు ఆదేశించారు. అసంక్రమిత వ్యాధులు – ఎన్సీడీపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలుపుతూ ఒక ప్రకటనలో వెల్లడించారు. జీవనశైలిలో మార్పుల కారణంగా గుండె సంబంధ వ్యాధులు, మధుమేహం వంటివి పెరుగుతున్న నేపథ్యంలో వీటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు తెలియజేయాలన్నారు. రోజూ పాఠశాల ప్రారంభంలో జరిగే కార్యక్రమంలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, శారీరక శ్రమ, పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండడం, ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యంపై విద్యార్థులకు వివరించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచిన ఒక ముఖ్యమైన గీతం వందేమాతరం ప్రసిద్ధి పొందింది. బంకిం చంద్ర చటోపాధ్యాయ రచించిన ఈ పాట 1875లో బెంగాలీ నవల ‘ఆనందమఠం’లో తొలుత ప్రచురితమైంది. 1896లో గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారిగా ఈ గీతాన్ని ఆలపించారు. స్వరాజ్య సంగ్రామంలో

భారతదేశ ప్రజలను ఏకం చేయడానికి, మాతృభూమికి ప్రాతినిధ్యం వహించే జాతీయవాద భావనను పెంపొందించడానికి ఈ గీతం చిహ్నంగా నిలిచింది. 1950లో భారత రాజ్యాంగ సభ ఈ గీతంలోని తొలి రెండు చరణాలను జనగణమనతో సమానమైన హోదాతో భారత జాతీయ గేయంగా ఆమోదించింది. ఈనెల 7వ తేదీన వందేమాతరం 150వ సంవత్సరాన్ని పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఆ గీతంలోని కొంత భాగాన్ని ఇప్పుడు విందాం.

వాయిస్ 29 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ –ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమాల అమలు, ఆరోగ్య వ్యవస్థల పనితీరు పరిశీలనకు కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఉమ్మడి సమీక్ష మిషన్ –సీఆర్‌ఎం బృందాలు పర్యటిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన రెండు జిల్లాల్లో నాలుగైదు రోజులపాటు సీఆర్‌ఎం ప్రతినిధులు పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. ఇందులో భాగంగా కేంద్ర ఆరోగ్య– కుటుంబ సంక్షేమ శాఖలోని పోషకాహార, అనుబంధ ఆరోగ్య సేవల ఉప కమిషనర్ డాక్టర్ జోయా అలీ రిజ్వీ నేతృత్వంలోని 12 మంది సభ్యుల బృందం ఈరోజు నుంచి ఈ నెల 7 వ తేదీ వరకు రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో పర్యటిస్తుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 15 సెకన్లు

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన “మీ కోసం” కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ తెలిపారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

=====================